# డ్రైనేజీ పైప్‌లైన్ల పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ సూర్యనగర్ బస్తీలో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ... గడచిన ఐదేళ్లలో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని మరో ఐదేళ్లల్లో నగరంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. జలమండలి అధికారి జ్యోతి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్, జనార్దన్, బస్తీ నాయకులు రవి, ప్రవీణ్, పి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి: సీపీఎం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మార్క్సిజం, లెనినిజం ప్రపంచానికి మార్గం చూపుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. దేశంలో నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం, లెనినిజాన్ని అనువదించుకోవాలన్నారు. దేశంలో విస్తరిస్తున్న మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ ఓ విప్లవాయుధం పుస్తకంపై సామూహిక పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ... రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలవకుండా చేయాలని అందుకోసం లెనినిస్టు విప్లవ ఎత్తుగడలను అనుసరించాలని సూచించారు. లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతం, సాధించిన విజయాలు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పార్టీ పునాది బలహీనపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మీద కాకుండా మత విశ్వాసాల మూలాల మీద పోరాడాలని సూచించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఆనందచారి, సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మహేందర్, టి.స్కైల్యాబ్‌బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న వీరయ్య

# కేంద్రం లిఖిత పూర్వక హామీలను నెరవేర్చాలి




నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... చట్టబద్ధంగా పంటల సేకరణ, సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణను ఆపడం, లకింపూర్ ఖేరీలో రైతుల ఊచకోతకు ప్రధాన కుట్రదారు హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేలిని తొలగించి ప్రాసిక్యూట్ చేస్తామని ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. తిరిగి ఆందోళన చేస్తున్న పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై అణచివేత కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసార్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య, సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, జంగారెడ్డి, మూడ్ శోభన్, పి.ప్రసాద్, అరుణజ్యోతి, టి.జి.నర్సింహారావు, ఆర్.శ్రీరామ్‌నాయక్, టి.స్కైల్యాబాబు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీల వాటా కోసం 1 నుంచి మహా పాదయాత్ర

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం మార్చి 1వ తేదీ నుంచి మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామం మీర్జాన్‌పల్లె నుంచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట ఖిలాషాపూర్ వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర బీసీ కుల జనగణన బిల్లు పెట్టడం తెలంగాణ బీసీ సమాజం పోరాట విజయమని ఆయన అన్నారు. ఏదైనా రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం ప్రయత్నిస్తే వెంటనే సంఘ్ పరివార్ శక్తులు కోర్టులో కేసులు వేస్తుంటాయని, దీంతో జనాభా లెక్కలు లేకుండానే రిజర్వేషన్లు ఎలా పెంచుతారని కోర్టులు మోకాలడ్డుతాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం కుల జనగణన చేయనంటోందని, కేంద్రం, సుప్రీం కోర్టు మధ్య ఓబీసీల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధనకై.. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం జరిగే మహా పాదయాత్రలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.



నరేందర్ గౌడ్

# ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.కమలాకర శర్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.సాగి కమలాకర శర్మ రెండేళ్ల కాలవ్యవధికి నియమితులయ్యారు. ఇంత కాలం అధిపతిగా కొనసాగిన ప్రొ.కాశీం పదవీ కాలం ముగియడంతో తెలుగు శాఖకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ (బీఓఎస్) ఉన్న ప్రొ.శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించగా తన పీహెచ్‌డీ శిష్యురాలు డాక్టర్ అరవింద పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఉత్తమ బోధనకులు, పరిశోధనకులుగా పేరుగాంచిన ప్రొ.శర్మ జ్యోతిష్యం, సాహిత్యంపై పది పుస్తకాలను రాశారు. తెలుగుతో పాటు సంస్కృతం, ఇంగ్లిష్, జ్యోతిష్యం, ఫిలాసఫీ, యోగా శాస్త్రంలో ఎంఏలు, జర్నలిజం, ప్రాకృతంలో పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన ప్రొ.శర్మ బహుభాషా కోవిదుడు. అనేక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న ఆయన వివిధ టీవీ చానల్స్‌లో ఉదయం ఆధ్యాత్మిక, భక్తి తదితర ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలలో ఉపదేశం ఇస్తారు. ప్రొ.శర్మ వద్ద 14 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేయగా మరో పది మంది వివిధ అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు.



ప్రొ.శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డా.అరవింద

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రామంతాపూర్: పాత రామంతాపూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌కి అదనపు అంతస్తు నిర్మాణానికి రూ.36 లక్షలు మంజూరు పత్రాన్ని బుధవారం ఉప్పల్ నియోజకవర్గం మందముల పరమేశ్వర్‌రెడ్డి బుధవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు ముత్యాల జంగయ్య, ఉపాధ్యక్షులు అరూరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి చీమకండ్ల జంగయ్య, ట్రెజరర్ ముత్యాల బాబురావు, భిక్షపతి ప్రకాష్, కుమార్, ఈశ్వర్, అంజయ్య, హరిదర్శన్, శ్రీరామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యంపై అక్రమార్కుల పంజా

- అంబర్‌పేట నియోజకవర్గంలో యథేచ్ఛగా దందా
- రేషన్ బియ్యం రాగానే రంగంలోకి ముఠాలు
- వృద్ధుల నుంచి బలవంతంగా లాక్కెళ్తున్న వైనం
- వచ్చే రేషన్ కోటా నుంచి దాదాపు 50 శాతం నల్లబజారుకే...



అంబర్‌పేట్: రేషన్ బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలుతున్నాయి. పేదల నుంచి బలవంతంగా అక్రమార్కులు సొంతం చేసుకుంటున్నారు. పౌరసరఫరాల శాఖ సర్కిల్–6 పరిధిలో అంబర్‌పేట నియోజకవర్గంలో రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు అడపదడప దాడులు చేసిన రేషన్ బియ్యం మాత్రం నల్ల బజారుకు తరలడంలో అగడం లేదు. ప్రతి నెల 1వ తేదీ రాగానే రేషన్ బియ్యం కోసం అక్రమార్కులు రంగంలోకి దిగుతున్నారు. రేషన్ కార్డుదారులు బియ్యం కొనుగోలు చేయగానే పెద్ద ఎత్తున వారినుంచి సేకరించేందుకు సిద్ధపడుతున్నారు. నియోజకవర్గంలో 69 రేషన్ దుకాణాల్లో 58,780 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరి వద్ద నుంచి 50 శాతంకు పైగా రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు సేకరించి దందా చేస్తున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర సంబంధిత అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకువాలని పలువురు కోరుతున్నారు.

**పకడ్బందీగా...**

నియోజకవర్గంలో ప్రధానంగా ఖాద్రీ బాగ్, మారుతీనగర్, ప్రేమ్‌నగర్, న్యూప్రేమ్‌నగర్, పటేల్‌నగర్, శంకర్‌నగర్, తిరుమలనగర్ ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరణ ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలను ఎంచుకొని రహస్య అడ్డాలుగా మార్చుకుంటున్నారు. సేకరించిన బియ్యాన్ని ఈ కేంద్రాల్లో దాచి గుట్టు చప్పుడు కాకుండా వారికి కావాల్సిన ప్రాంతాలకు తరలించుకుంటున్నారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన టీనేజ్ యువతను రంగంలోకి దింపి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. యువత బియ్యం తీసుకున్న వెంటనే వారి ఇంటికి వెళ్లి బియ్యం అమ్మాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వృద్ధుల నుంచి రేషన్ బియ్యాన్ని బలవంతంగా లాక్కెళ్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రేషన్ బియ్యాన్ని లాక్కెళ్లిన సంఘటనపై పోలీసులకు సైతం ఫిర్యాదుల వచ్చాయి. ఇకనైనా పటిష్టంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

**కిలో రూ. 10 ప్రకారం...**

రూపాయి కిలో బియ్యాన్ని పది రూపాయిలకు కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రజలకు వచ్చే రేషన్ బియ్యం నుంచి దాదాపు 50 శాతం అక్రమార్కులు కొనుగోలు చేస్తున్నారు. ఫాక్టరీలు, హోటల్స్ కోసం ఈ బియ్యాన్ని ప్రధానంగా సేకరిస్తున్నారు. ప్రతి నెల లక్ష్యాన్ని నిర్దేశించుకొని బియ్యాన్ని సేకరిస్తున్నారు. మధ్య తరగతి ప్రాంతాల్లోనే ఎక్కువ బియ్యాన్ని సేకరిస్తున్నారు.

**క్రిమినల్ కేసులు తథ్యం**

రేషన్ పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. రేషన్ డీలర్లకు బియ్యం పక్కదారి పట్టకుండా చొరవ తీసుకోవాలని ఆదేశాలిచ్చాం. రేషన్ బియ్యం అక్రమార్కులకు చేరకుండా తరుచు తనిఖీలు చేస్తున్నాం. రేషన్ బియ్యం నల్లబజారుకు తరలించే అంశంపై తమకు సమాచారం ఇస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తాం. తమకు ఫిర్యాదు చేస్తే అప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం.

– దీప్తి, ఏఎస్‌వో, పౌరసరఫరాల శాఖ సర్కిల్–6

## నియామకం

కాచిగూడ: తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరాల గౌతమ్‌కుమార్‌ను నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామకపు పత్రాన్ని అందజేశారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కందగట్ల స్వామితో కలిసి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... పద్మశాలి యువతను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ పనుల పర్యవేక్షణ

కాచిగూడ: నింబోలిఅడ్డ మెయిన్ రోడ్డులో ఉన్న సమోస పార్కులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం పర్యవేక్షించారు. అనంతరం రహమత్ బాగ్ బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు శ్రీకాంత్, నిఖిల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి



చిక్కడపల్లి: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ నెల 15న బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాల వద్ద వ్యక్తి(60) అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి వచ్చి చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు బుధవారం తెలిపారని ఎస్ఐ మౌనిక, ఏఎస్ఐ వెంకటకుమార్‌లు పేర్కొన్నారు. వృద్ధుడి వివరాలు తెలిస్తే 8712660166, 8179564455 నంబర్లలో సంప్రదించాలని వారు తెలిపారు

## అప్పు చెల్లించలేదని యువకుడిపై కత్తులతో దాడి

అబిడ్స్: తీసుకున్న అప్పు చెల్లించలేదని యువకుడిపై పాతమిత్రులు కత్తులతో దాడి చేసిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగాబౌలిలో చోటు చేసుకుంది. నిఖిల్, లడ్డూ అలియాస్ వినోద్‌గౌడ్, ఆకాశ్, దీపక్ సింగ్ పాతమిత్రులు. నిఖిల్ కొన్ని నెలల క్రితమే లడ్డూ అలియాస్ వినోద్‌గౌడ్ దగ్గర రూ.80 వేల అప్పుగా తీసుకున్నాడు.. రూ.60 వేలు తిరిగి లడ్డూకు ఇచ్చాడు. మిగతా రూ.20 వేలు ఇవ్వాలని లడ్డూ కొన్ని రోజులుగా నిఖిల్‌ను వేధిస్తున్నాడు. బుధవారం గంగాబౌలి దగ్గరకు నిఖిల్‌ను పిలిపించి లడ్డూ, ఆకాష్, దీపక్ డబ్బుల విషయంలో వాగ్వాదానికి దిగారు. కోపంతో లడ్డూ నిఖిల్‌పై కత్తితో దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన నిఖిల్‌ను మంగళ్‌హాట్ పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారాలి

కాచిగూడ: బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారి అన్ని వర్గాలను కలుపుకుని రాబోయే రోజుల్లో అధికారం చేపట్టాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం అధ్యక్షుడు కొప్పూరు భాస్కర్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వి మహేందర్ కుమార్, ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం కొప్పూరు భాస్కర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కొప్పూరు భాస్కర్ రావు నేతృత్వంలో త్వరలోనే రాజకీయాలకతీతంగా బీసీ ప్రముఖులందరిని ఒకే వేదికపైన ఘనంగా సత్కరించి బీసీల సత్తా చాటేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగిన పరిణామమని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు కేటాయించాలని, బీసీ వర్గాలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. బీసీ సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో ఉజ్వల భవిత



కశ్యప్‌ను సత్కరిస్తున్న పద్మజ

చిక్కడపల్లి: పుస్తకాలు చదవడంతో ఉద్యోగాలు సాధంచారని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల ప్రకటించిన స్కూల్ లైబ్రేరియన్ పరీక్షల ఫలితాల్లో నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలో చదివిన విద్యార్థి జి.కశ్యప్ గురుకుల స్కూల్ లైబ్రేరియన్‌గా ఉద్యోగం వచ్చినందుకు బుధవారం గ్రంథాలయం ఆవరణలో ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ... అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చదివి ఉద్యోగాలు అనేక మంది పొందారని అన్నారు నగర కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినీవిద్యార్థులు ఇదే విధంగా ఏకాగ్రతతో, అంకిత భావంతో చదవి పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయం గ్రేడ్–1 లైబ్రేరియన్ మదన్మోహన్, గ్రేడ్–2 లైబ్రేరియన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్, వెంకటేష్ యాదవ్, కష్టారెడ్డి, సుకేష్‌కుమార్, రాంమోహన్, నరేంద్ర, విద్యార్థి నేత డి.సలీం తదితరులు పాల్గొన్నారు.

# ఈజీ మనీకి ఆశపడొద్దు

- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన
- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: రోజు రోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అమాయక ప్రజల నుంచి లక్షలు, కోట్ల రూపాయలను కేటుగాళ్లు కాజేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ కారణంగా బాధితులు సైబర్ వలలో పడుతున్నారు. తాజాగా సైబర్ నేరాలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ భవానీల ఆధ్వర్యంలో నారాయణగూడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నకిలీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలతో పాటు ఇతర సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఈ తరహా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేటుగాళ్లు మాయమాటల ద్వారా పంపించే సందేశాలను నమ్మవద్దని చెప్పారు. కొన్ని కేసులలో తమ అనుభవాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానంగా స్టాక్ మార్కెట్‌లో సెబి అనుమతి ఉన్న యాప్‌లలో కాకుండి ఇతర యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టవద్దని, దీంతో పాటు స్టాక్ బ్రోకర్ వారి అధికారిక అకౌంట్లలలో మాత్రమే డబ్బు స్వీకరిస్తారని, తమ పెట్టుబడులను వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయవద్దని, గూగుల్ ప్లే, వారి సొంత వెబ్‌సైట్‌ల నుంచి డౌన్ లోడ్ చేస్తున్నప్పుడు ఆయా అప్లికేషన్లు ఒకసారి నిర్ధారించుకోవాలని, తమ తమ డీమ్యాట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో ఎప్పుడూ పంచుకోవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాలలో వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగాంలలో నకిలీ సంభాషణలను నమ్మవద్దని, వారు పంపిచే ఆకర్షణీయమైన ప్రకటనలతో కష్టపడి సంపాదించిన డబ్బును గుడ్డిగా పెట్టుబడి పెట్టవద్దనే పలు అంశాలపై విద్యార్థుకు సమగ్రమైన అవగాహన కల్పించారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: జైస్వాల్ గార్డెన్‌లో ఆలయ అభివృద్ధికి తనవంతు చేయూతనిస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ కాలనీ ప్రవేశం ద్వారంలో కమాన్ నిర్మించేందుకు చేపట్టిన భూమి పూజకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరయ్యారు. కమాన్ నిర్మాణానికి వ్యక్తిగతంగా పూర్తి స్థాయిలో చేయూతనిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాలనీలో ఆలయాలు, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతాల శ్రీనివాస్ ముదిరాజ్, చైర్మన్ ఎ.రామగౌడ్, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ప్రసన్నంజనేయులు, అధ్యక్షుడు ఎస్.రమేష్‌గౌడ్, ప్రతినిధులు యాదవరెడ్డి, బి.మధుసూదన్‌చారి పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం



చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్యపై ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. బహిరంగ చెత్త కేంద్రాల నుంచి చెత్తను తరలించడంలో జరుగుతున్న జాప్యంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. ఇటీవల కాలంలో పారిశుద్ధ్య సమస్యపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె అగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణ చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు.

## అక్రమ కేసులను ఎత్తివేయాలి



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముషీరాబాద్: న్యూడెమాక్రసీ నాయకత్వంపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాభవన్‌లో బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, గౌని ఐలయ్య, జి.అనురాధలు డిప్యూటీ సీఎంను కలిసి వివరించారు. ఏజెన్సీ గ్రామాలపై పోలీసు కుంబింగ్‌ని నిలిపి వేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఆశోక్ తదితరుల అరెస్టు, అనంతరం పరిణామాలను వివరించి సానుకూలంగా స్పందించాలని కోరారు.

## ఆర్పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వర్ణలత



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ (బొజ్జ తారకం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్లకుంటలోని తిలక్‌నగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది వి.స్వర్ణలతను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు న్యాయ సలహాలు అందిస్తు న్యాయవాదిగా సేవలు అందిస్తున్న స్వర్ణలతను ఎంపిక చేశారన్నారు. పేద వర్గాల ప్రజల హక్కుల కోసం ముందుకు సాగాలనే లక్ష్యంతో పని చేస్తున్న స్వర్ణలత సేవలను గుర్తించనట్లు వెల్లడించారు.

## బైక్ దొంగల అరెస్టు




పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

చిక్కడపల్లి: వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని దోమలగూడ పోలీసులు అరెస్టు చేశారు. వరుస బైక్ దొంగల వివరాలను ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మహ్మద్ సమీర్(20),అల్తాఫ్(20), మహ్మద్ ఒమెన్ (42), శేఖర్ చింతకాయల (36)లు దోమలగూడలోని ఏజీఎస్ బైక్ సర్వీస్ పాయింట్ అప్పర్ ట్యాంక్ బండ్ గ్యారేజీ తాళాలు పగులగొట్టి బైకులను దొంగలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు డీఐ ఎం.వరప్రసాద్, ఎస్ఐ ఎస్.శ్రీ గిరి శ్రీకాంత్, క్రైం బృందం ఖలీల్, వంశీ, ఉదయ్‌లు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నలుగురుని పట్టుకొని విచారించగా దోమాలగూడ పీఎస్ పరిధిలో ఐదు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఆయన చెప్పారు. దొంగతనం చేసిన వాహనాల విడి భాగాలను స్క్రాబ్ చేసి అమ్మే వారని వీటి విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నలుగురు దొంగలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ కథనం మేరకు... యాకుత్‌పురా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం మహ్మద్ రఫిక్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత

రామంతాపూర్: డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీమల్లికార్జున స్వామి దేవాలయ మాజీ చైర్మన్ నామ్ గోవర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. గోవర్ధన్‌రెడ్డి భౌతిక కాయాన్ని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. డివిజన్‌లో గోవర్ధన్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కంది ఆదిరెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, మురళిగౌడ్, సందీప్ పటేల్, భాస్కర్ ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383